క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని వ్రతం



అలంకరణలో లక్ష్మి సత్యనారాయణ స్వామి

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ప్రభాత పూజలనంతరం ఉత్సవర్లకు పంచామృతాభిషేకం చేసి పూలు, సువర్ణ ఆభరణాలతో కనుల పండువగా అలంకరించారు. ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చి సత్యదేవునివ్రతం నిర్వహించారు. భక్తులు సామూహికంగా నామ జపం చేశారు. అనంతరం అర్చకులు విజయ్‌భట్టర్ వారికి వ్రత మహిమను వివరించి వ్రత కథలు, ఫలితాల గురించి తెలియజేశారు. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

31న జాబ్‌మేళా

వైవీయూ / కడప సిటీ: కడప నగరంలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐలో ఈనెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ కె. రత్నరాజు తెలిపారు. కడపకు చెందిన గోల్డ్‌ఫీల్డ్స్ జేసీబీ, సాయివేణి కమ్యూనికేషన్స్ అండ్ అసోసియేట్స్, లక్ష్మిమేఘన ఎంటర్‌ప్రైజెస్ తదితర కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికయ్యే అభ్యర్థులకు రూ.10వేల నుంచి రూ.16 వేల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలు, మార్కులిస్టులు, 2 ఫొటోలు, ఆధార్‌కార్డు, బయోడేటాలతో హాజరుకావాలని సూచించారు.

1న బహిరంగ సభ

కడప వైఎస్ఆర్ సర్కిల్: లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం నవంబర్ 1న కడప పాత బస్టాండ్ వద్ద జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ప్రజారక్షణభేరి బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు రామ్మోహన్, మనోహర్, సుబ్బమ్మ ,దస్తగిరి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3న బ్రౌన్ గ్రంథాలయ స్థలదాత సీకే సంపత్ కుమార్ జయంతి

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నవంబరు 3న ఉదయం 10.00 గంటలకు బ్రౌన్ గ్రంథాలయ స్థల దాత సీకే సంపత్‌కుమార్ జయంతి నిర్వహిస్తున్నట్లు బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి వైవీయూ ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్ ముఖ్య అతిథిగా, కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య సభాధ్యక్షులుగా పాల్గొంటారని తెలిపారు. వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సీకే సంపత్‌కుమార్ కుమార్తె సీఎస్ సుప్రజ, ప్రముఖ ఆడిటర్ లయన్ పి.ఖాసింఖాన్‌లు ఆత్మీయ అతిథులుగా హాజరవుతారన్నారు.

చర్చి స్థలాన్ని కాపాడండి

కడప కల్చరల్ : చర్చి స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రెవరెండ్ మల్లెం విజయభాస్కర్, షమ్మ మినిస్ట్రీస్ అధ్యక్షులు అమ్ములు సీకే దిన్నె తహసీల్దార్‌ను కోరారు. శనివారం వారు తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. సీకే దిన్నె మండలం చెర్లోపల్లె గ్రామంలో 158/5ఏ సర్వే నెంబరులో 45 సెంట్ల స్థలం ఉందని, ఇక్కడ పదేళ్లుగా ప్రార్థనలు చేసుకుంటున్నారని తెలిపారు. 2015లో ఈ స్థలాన్ని ఎద్దుల పుష్పరాజు చర్చి నిర్మించుకునేందుకు దాన విక్రయం అగ్రిమెంటు ద్వారా రాసిచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన సంబంధీకులు చర్చి స్థలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి కాంపౌండ్ బండలను పగులగొట్టారని ఫిర్యాదు చేశారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీపీఎఫ్ నగర అధ్యక్షులు పాస్టర్ సుధీర్‌కుమార్, కార్యదర్శి పాస్టర్ డేవిడ్ రాజ్, రాజకుమారి, భారతి, శేఖర్, ప్రదీప్, రమేష్, మధు, సురేష్ పాల్గొన్నారు.

దర్గాలో ఘనంగా గ్యార్మీ ఉత్సవం

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట సమీపంలోని దర్బారు సాయినగర్ వద్ద ఉన్న దర్గాలో శనివారం సాయంత్రం మహబూబ్ సుబహానీ గ్యార్మీ జెండా ఉత్సవాన్ని దర్బారు సాయి భక్తులు, నిర్వాహకులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మొదట దర్గాలో ఫాతెహా సమర్పించారు. అనంతరం జెండా ఉత్సవాన్ని జరిపారు. ఏటా సద్గురు పీఠంలో గ్యార్మీ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సత్యమయ్య, శంకరనారాయణ, దర్బార్, జాఫర్, జాకీర్, నరసింహా, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

కడప కార్పొరేషన్ : పేదల ఆరోగ్యం పట్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. శనివారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష మాట్లాడుతూ.. పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి పేద వాడిని ఆదుకోవడానికి ఆరోగ్యశ్రీ పథకం వర్తించని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందజేస్తున్నారన్నారు. కడప నగరంలో ఈ నాలుగేళ్లలో రూ. 8 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయం కింద ఇంత పెద్ద మొత్తంలో పేద ప్రజలకు సహాయం అందించడం గొప్ప విషయం అన్నారు. తొలుత కడప నగరానికి చెందిన రజియా బేగంకు రూ. 1,50,000, కె.నాగేశ్వరమ్మకు రూ.70 వేలు, వేముల సుజా తకు రూ. 65 వేలు, సెబ్రోలి గ్రేస్ మెరిస్‌కు రూ.1,20,000 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాగేంద్ర ప్రసాద్, అజ్మతుల్లా ఖాన్, హరూన్‌బాబు, నాయకులు సుబ్బారాయుడు, సి. రవి, సుధాకర్ పాల్గొన్నారు.



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

సారస్వతమూర్తి .. జానమద్ది

నేడు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి అవార్డు ప్రదానోత్సవం



తెలుగు సాహిత్య రంగంలో మరువలేని పేరు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి. వైఎస్సార్ జిల్లా సాహిత్య లోకంలో ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అటు గ్రంథాలయాల అభివృద్ధి, ఇటు బ్రౌన్ గ్రంథాలయం ఏర్పాటుతో సాహిత్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిన డాక్టర్ జానమద్ది పేరిట ఈనెల 29న అవార్డు ప్రదానం చేస్తున్న సందర్భంగా ఆ సారస్వతమూర్తి గురించి క్లుప్తంగా....

కడప కల్చరల్ : తెలుగుభాష పరిరక్షకులుగా ఆంగ్లేయుడు సీపీ బ్రౌన్ అనంత కీర్తిని పొందారు. ఆయన చేసిన తెలుగు సాహితీకృషిని డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి తెలుగు వారికి అపూర్వ కానుకగా అందజేశారు. బ్రౌన్ కార్యక్షేత్రమైన భవన శిథిలాలపైనే అపూర్వమైన కానుకగా సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయం, భాషా పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ జానమద్దిలో ఆడంబరం కనిపించేది కాదు. ఆయన పేరుగాంచిన సాహితీవేత్త అయినా కూడా తొలి కవిత రాసిన వారితోనైన జానమద్ది ఎంతో ఆప్యాయంగా ఉండి ప్రోత్సహించేవారు. చిన్న సాహితీ సభలకు సైతం సమయానికన్నా ముందే వెళ్లి ఏర్పాట్లు చూసేవారు. కుర్చీలు వేయడానికి కూడా వెనకాడేవారు కాదు.

సాహితీ సౌరభం..

జాతీయ స్థాయిలో తెలుగు కవులు, రచయితలతో ఆత్మీయ అనుబంధం గల ఆయన తెలుగు, ఆంగ్ల, కన్నడల్లో పలు రచనలను అనువదించారు. స్వయంగా ఎన్నో పుస్తకాలు రచించారు. అటు ప్రాచీన సాహిత్యం, ఇటు అభ్యుదయ సాహిత్యాన్ని ఒకేలా ఆదరించారు. ముఖ్యంగా జిల్లాలోని దాదాపు అందరూ కవులు, రచయితల గురించి పత్రికలలో అక్షరబద్ధం చేశారు. ప్రముఖులపై వేలాది వ్యాసాలు రాశారు.

- మన జిల్లాలో పత్రికలకు ప్రముఖ దినోత్సవాలు, ప్రముఖ వ్యక్తుల జయంతులు, వర్ధంతుల సందర్భంగా వ్యాసాలు రాసే ఒరవడికి ఆయనే శ్రీకారం చుట్టారని చెప్పవచ్చు. సన్నిహితులు ఆయనను వ్యాస మహర్షిగా పేర్కొనడం విశేషం. జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా గొప్ప కవులను జిల్లాకు ఆహ్వానించి సభలు ఏర్పాటు చేశారు. బ్రౌన్ గ్రంథాలయాన్ని జిల్లాలో సాహితీ సభలకు ముఖ్య కేంద్రంగా మార్చారు. విద్వాన్ కట్టా నరసింహులును మానస పుత్రుడిగా అభిమానించి క్లిష్టమైన కడప కైఫీయత్తులను ఆయన ద్వారా పరిష్కరింపజేసి కీర్తి ప్రతిష్ఠలు సంతరించిపెట్టారు. సాహిత్యం పట్ల అభిమానం, అభిరుచి ఉన్న వారిని ఎంతో ఆదరించి ఆ రంగం వైపు ప్రోత్సహించారు. తెలుగుభాష సంస్కృతుల పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు ఏ సమాచారం కావాలన్నా ఆయననే సంప్రదించేవారు.

సాహితీ సౌధం.. నిర్మాణం

కడప నగరంలో జిల్లా రచయితల సంఘం సమావేశాలకు హాజరైన ఆరుద్ర, బంగోరే లాంటి సాహితీవేత్తలు బ్రౌన్ నివసించిన స్థలాన్ని డాక్టర్ హనుమచ్ఛాస్త్రి ద్వారా దర్శించుకున్నారు. ఆ పవిత్ర స్థలానికి శాశ్వత పవిత్రత కల్పించేందుకు గ్రంథాలయ నిర్మాణం చేపట్టాలని భావించి నాటి కలెక్టర్‌ను కలిశారు. ఆయన సూచన మేరకు తన ఆధీనంలో ఉన్న బ్రౌన్ బంగళా స్థలాన్ని నాటి ప్రముఖ ఆడిటర్ సంపత్‌కుమార్ బ్రౌన్ పేరిట ఏర్పాటు చేసిన ట్రస్టుకు అప్పగించారు. అక్కడ గ్రంథాలయ నిర్మాణం కోసం డాక్టర్ జానమద్ది నడుం బిగించారు. స్వయంగా విరాళాలు సేకరించి అద్భుతమైన సాహితీ సౌధాన్ని నిర్మింపజేశారు. అందుకోసం జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థుల నుంచి రూపాయి చొప్పున సేకరించారు. ఒరిస్సా ప్రాంతం నుంచి ఆంధ్ర కార్మికుడొకరు గ్రంథాలయ నిర్మాణానికి రూ. 10 మనీ ఆర్డర్ పంపిన విషయాన్ని డాక్టర్ జానమద్ది పలు సందర్భాల్లో తెలిపేవారు. ఆయన కృషి వల్లనే తెలుగు వారికి అద్భుతమైన సారస్వత కేంద్రం, ఘనమైన వారసత్వ సంపదగా మిగిలింది.

కీర్తిపరిమళం

- డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 1925 అక్టోబరు 20న జన్మించారు. జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా గొప్ప కవులను జిల్లాకు ఆహ్వానించి సభలు ఏర్పాటు చేశారు.
- బ్రౌన్ గ్రంథాలయాన్ని జిల్లాలో సాహితీ సభలకు ముఖ్య కేంద్రంగా మార్చారు. గ్రంథాలయానికి ఆయన అందించిన సేవలకు గుర్తుగా 2014 అక్టోబరులో గ్రంథాలయ ఆవరణలో డాక్టర్ జానమద్ది శిలా విగ్రహాన్ని నాటి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ద్వారా ఆవిష్కరింపజేశారు.
- 1998లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆయనకు డాక్టరేట్ అందజేసింది. ఆయన పేరిట 2012లో కుమారుడు, బ్యాంకు రిటైర్డ్ అధికారి జానమద్ది విజయభాస్కర్ జానమద్ది సాహితీ పీఠం ఏర్పాటు చేసి సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.
- 2023కుగాను ఈనెల 29న బ్రౌన్ గ్రంథాలయంలో డాక్టర్ జానమద్ది పేరిట అవార్డును సాహితీవేత్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్‌కు అందజేయనున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చెన్నూరు : అర్హుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అధికారులు అనేక సార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేవిధంగా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 15 వేల మెగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తోందన్నారు. దీనికోసం 58 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. తద్వారా ప్రభుత్వ ఆసుపత్రులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ప్రతి 2 వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేసి, గ్రామంలోని 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటుచేసి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. జాతీయ రహదారిలో ఇల్లు కోల్పోయిన బాధితులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. చెన్నూరు గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి చాలా ఇరుకుగా ఉందని దానిని వెడల్పు చేయాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వ పథకాలకు, అభివద్ధికి సంబంధించి ప్రతి గ్రామ సచివాలయంలో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారన్నా రు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఆర్ ఆర్, సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామమూర్తి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సొంటం నారాయణరెడ్డి, చెన్నూరు సర్పంచ్ సిద్ధిగారి వెంకటసుబ్బయ్య, ముమ్మడి సుదర్శన్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ వారిష్, ఎంపీటీసీలు, నిరంజన్‌రెడ్డి, నాగి రెడ్డి, సాదిక్ అలీ, అధికారులు తహసీల్దార్ పఠాన్ అలీఖాన్, ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ, పంచాయతీరాజ్ డీఈ మురళి, ఈవోపీఆర్డీ సురేష్‌బాబు, విద్యుత్ ఏఈ రామలింగారెడ్డి, డాక్టర్ చెన్నారెడ్డి, ఏపీఎం గంగాధర్, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

మండలాన్ని కలసికట్టుగా అభివృద్ధి చేద్దాం

చింతకొమ్మదిన్నె : మండలాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు కలసికట్టుగా పనిచేసి అభివృద్ధి పథంలో నడిపిద్దామని సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలోని సభా భవనంలో ఎంపీడీవో శ్రీధర్ అధ్యక్షతన మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అందవలసిన సంక్షేమ పథకాలు అన్నీ అందుతున్నాయన్నారు. అందని పక్షంలో అధికారులు వాటిపై దృష్టి సారించాలన్నారు. తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉపమండల అధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలంలో చుక్కల భూములు, అసైన్డ్ కమిటీలోని భూములు పట్టాలు అవుతున్నప్పటికీ చింతకొమ్మదిన్నె మండలంలో ఎందుకు అవటంలేదని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. రైతులను ఇబ్బందికి గురిచేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ అలాంటిది ఏమైనా ఉంటే రైతులు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కళాయాదవ్, ఎంఈఓ వెంకటరామిరెడ్డి, సర్పంచులు సురేంద్రరెడ్డి, నాగముని, సుభద్ర, మహేశ్వరి, సుబ్బ రాయుడు, ఎంపీటీసీలు నాగరాజు, వెంకటరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి

కడపలో బుల్లితెర నటుల సందడి



మీడియాతో మాట్లాడుతున్న బుల్లితెర నటులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో బుల్లితెర నటులు రాకెట్ రాఘవ, చలాకీ చంటి, నాగి, భానుశ్రీ, సిరి, వాసంతి శనివారం సందడి చేశారు. అక్కాయపల్లెలో ఏర్పాటు చేసిన ఏ–7 బ్యూటీ వరల్డ్‌ను వారు ప్రారంభించారు. బుల్లితెర నటులను చూసేందుకు యువతీ యువకులు పోటీలు పడ్డారు. ఈ సందర్భంగా రాకెట్ రాఘవ, చలాకీ చంటిలు మాట్లాడుతూ ఈ షోరూం ఎండీ అశోక్‌రెడ్డి వ్యాపారంలో రాణించి ఇలాంటి మరిన్ని శాఖలు ప్రారంభించాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో త్రేతేశ్వరుడికి గిరి ప్రదక్షిణ

రాజంపేట రూరల్ : శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామికి భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. మండల పరిధిలోని అత్తిరాలలో శనివారం సాయంత్రం 6 గంటలకు గిరిప్రదక్షిణను కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో త్రేతేశ్వరుడికి మొక్కులు చెల్లించి ప్రారంభించారు. 'హరహర మహదేవ శంభో శంకర' అనే నామస్మరణతో అత్తిరాల పరిసరాలలో శివ నామస్మరణ హోరెత్తింది. కామాక్షిమాతను, త్రేతేశ్వరుడిని ప్రత్యేక పల్లకీలో కొలువుదీర్చారు. స్వామి వారి పల్లకీని భక్తులు మోస్తూ, భక్తి గీతాలు ఆలపిస్తూ చేపట్టిన కార్యక్రమం శ్రీవినాయకస్వామి గుడి వద్దకు చేరుకోగానే రవి ఆచారి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామి వారికి గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు యూపీ రాయుడు అన్నప్రసాదాన్ని అందజేశారు. ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు శ్రీచక్ర హైస్కూల్ ఎండీ రాఘవ రెడ్డి వెంకటేశ్వరరెడ్డి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. గిరి ప్రదక్షిణ చేస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.

పుష్పగిరిలో...

వల్లూరు : పుష్పగిరి పుణ్య క్షేత్రంలో పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం భక్తులు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తరలివచ్చిన భక్తులు పుష్పగిరి కొండకు కొబ్బరి కాయలు కొట్టి భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ, శ్రీ సంతాన మల్లేశ్వరస్వాములను దర్శించుకుని పూజలు చేశారు. పెన్నానదిలో స్నానాలు ఆచరించారు. పుష్పగిరి క్షేత్ర ధర్మ నిర్ణయ మండలి అధ్యక్షుడు దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు తాగు నీటి సౌకర్యాలను కల్పించారు. అంతకు ముందు ఆలయంలో చెన్నకేశవ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉచిత వైద్యశిబిరం

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని అడిషనల్ కమాండెంటు కె. ప్రభుకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమాండెంటు శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బెటాలియన్‌లోని కళ్యాణ మండపంలో కడప హోలిస్టిక్ వారి సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. బెటాలియన్‌లోని ఆఫీసర్స్, బెటాలియన్ పోలీసులు, వారి కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు, చిన్న పిల్లలు మొత్తం 106 మందికి ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ చరిత, దంత వైద్యులు డాక్టర్ పవన్, కార్డియాలజిస్టులు డాక్టర్ శ్రావన్‌కుమార్ ఎండీ, డాక్టర్ నవీన్ అహ్మద్ ఎండీ, జనరల్ మెడిషన్ డాక్టర్ భద్రి మల్లికార్జునప్రసాద్, గైనకాలజిస్టు డాక్టర్ సందా సౌజన్యలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అంతేగాకుండా కడప రిమ్స్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 39 మంది బెటాలియన్ పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంటు కమాండెంటు వి. కేశవరెడ్డి, వి. జయప్రసాద్, వెంకట్‌రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, యూనిట్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చీనీ రైతుల్లో 'ధర'హాసం

పులివెందుల రూరల్ : పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ మార్కెట్‌లో చీనీకాయల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో మార్కెట్‌కు చీనీ కాయలు తరలించే రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మార్కెట్‌లో వేలంపాటను నిర్వహించగా రూ.40వేలు పలికింది. దీంతో చీనీ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దీంతో పులివెందుల ప్రాంతంలో పండించిన చీనీకాయలను రైతులు మార్కెట్‌కు తరలించి విక్రయాలు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డిలు చీనీ మార్కెట్‌లో నిర్వహించిన వేలంపాటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పులివెందుల్లో చీనీకాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

పులివెందుల రూరల్ : స్థానిక ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఆర్టీసీ లక్ష్యమని ఇన్‌చార్జి డీఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన డిపో ఉద్యోగులను ఉద్దేశించి గేట్ మీటింగ్ నిర్వహించి మట్లాడారు. రవాణా రంగంలో కూడా ప్రయాణికులకు, రైతులకు, ఉద్యోగులకు, వ్యాపారస్తులకు డోర్ డెలివరీ సదుపాయం గురించి తెలియజేయాలన్నారు. ప్రయాణికులే దేవుళ్లని, ప్రయాణికులు కోరిన చోట బస్సు ఆపడం, ఎక్కించుకోవడం చేయాలన్నారు. ప్రయాణ కూడళ్ల వద్ద రెండు నిమిషాలు బస్సులు ఆపి ఊరి పేర్లు చెప్పి ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలన్నారు. ముఖ్యంగా ప్రమాదాలు నివారించే విధంగా కండక్టర్లు ఫుట్‌బోర్డు మీద నిలబడిన ప్రయాణికులను గమనిస్తూ ఉండాలన్నారు. డోర్ డెలివరీ పక్షోత్సవాలను విజయవంతం చేసేవిధంగా ఆర్టీసీ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కుల్లాయప్ప, ఆర్ ఎం.రెడ్డి, ఆచారి, డ్రైవర్, కండక్టర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలయం మూసివేత

రాయచోటి టౌన్ : చంద్రగ్రహణం సందర్భంగా శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయ తలుపులు మూసివేస్తున్నట్లు ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిలు తెలిపారు. శనివారం రాత్రి అశ్విని నక్షత్ర యుక్త రాహుకాల పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా సాయంత్రం 6:30 గంటల నుంచి ఆదివారం ఉదయం 4:30 గంటల వరకు ఆలయ తలుపులు మూసివేస్తున్నట్లు తెలిపారు.

చెస్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



ట్రోఫీలు, మెడల్స్ అందుకున్న క్రీడాకారులతో నిర్వాహకులు

కడప స్పోర్ట్స్: బెంగుళూరు నగరంలోని వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో శనివారం నిర్వహించిన 48వ బీఆర్ డీసీఏ జాతీయస్థాయి ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన క్రీడాకారులు పతకాలు సాధించినట్లు జిల్లా చదరంగం కార్యదర్శి బి. అనీస్ దర్బారీ తెలిపారు. బాలికల విభాగంలో అండర్–7 కేటగిరీలో అమీనా 5వ స్థానం, అండర్–9 కేటగిరీలో లక్ష్మిమనుశ్రీ 5వ స్థానం, షణ్ముఖ కళ్వీ 6వ స్థానం, అండర్–11 కేటగిరీలో ఖ్యాతిమయి 7వ స్థానం, అండర్–15 విభాగంలో తేజామయి 6వ స్థానం, 50 ప్లస్ విభాగంలో అనీస్‌దర్బారీ ప్రథమ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. వీరితో పాటు యంగెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నితార అర్వి సాధించినట్లు తెలిపారు. వీరికి ట్రోఫీలు, మెడల్స్‌ను నిర్వాహకులు అందజేసి అభినందించినట్లు తెలిపారు.

నేడు నిరసన

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆటోనగర్ డిపో డ్రైవర్‌ను కావలి వద్ద కొంతమంది దుండగులు మూకుమ్మడిగా చేసిన దాడిని ఖండిస్తున్నామని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తెలిపారు. శనివారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం అన్ని డిపోలు, యూనిట్ కార్యాలయాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తామన్నారు. భోజన విరామ సమయంలో గేట్ మీటింగ్ కూడా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర్ రావు సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని యూనియన్ నాయకులు ఏఆర్ మూర్తి, రాములు తెలిపారు.

4న ఇంటర్వ్యూ

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షల విభాగంలో పనిచేసేందుకు కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. బీఏ/బీకాం/బీఎస్సీ కంప్యూటర్స్ పాసై ఎంఎస్ ఆఫీసు వర్కులో అనుభవం ఉండాలని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు రెజ్యూమ్, ధృవీకరణ పత్రాలతో ఈనెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు కళాశాలలో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

ఐదు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా 5 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ఇన్‌చార్జి కమిషనర్ రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రాస్ రోడ్డు సమీపంలో నగర ప్రవేశం వద్ద జరుగుతున్న ఆర్చి నిర్మాణం కారణంగా ట్రాఫిక్‌ను మార్కెట్ యార్డు సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ పక్క నుంచి మరలించడం జరిగిందని వాహన దారులు, నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన అందులో తెలిపారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

పెండ్లిమర్రి : పేదప్రజల ఆరోగ్యం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారని ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ తెలిపారు. మండలంలోని నందిమండలం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మారు మూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదని, అందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చూట్టారన్నారు. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేష్, మాధవిలత, వైద్యులు పాల్గొన్నారు.

బస్సు జాతా విజయవంతం చేయండి

వైవీయూ : కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం నిర్వహించే బస్సుజాతాను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి. శివకుమార్, నగర కార్యదర్శి డీఎం ఓబులేసు కోరారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో బస్సుజాతాకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఉద్యోగ పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్. సిద్ధికి, విద్యార్థులు పాల్గొన్నారు.